



వరదనీటిలో ముప్పావు శాతం మేర మునిగిన కురుక్కుతురై మురుగన్ ఆలయం

తుఫానుగా మారనున్న వాయుగుండం

డెల్టా ప్రాంతంలో భారీ వర్షం ● నీట మునిగిన పంటలు

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఈ నెల 25వ తేదీనాటికి తుఫానుగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ కారణంగా రాష్ట్రంలోని కోస్తాతీర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం శ్రీలంకకు దక్షిణంగా కేంద్రీకృతమైవున్న వాయుగుండం కొంతదూరం జరిగి గల్ఫ్ ఆఫ్ మన్నార్ ప్రాంతంవైపు వచ్చింది. ఇది దక్షిణ తమిళనాడుకు సమీపానికి కదులుతూ వస్తోంది. ఈ కారణంగా గల్ఫ్ ఆఫ్ మన్నార్‌తో పాటు రామేశ్వరం, శ్రీలంకలోని కోస్తాతీర ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాల్లో కూడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా కొడిక్కరై, రామేశ్వరం, ధనుష్కోడి ప్రాంతాల్లో రెండు రోజుల పాటు వర్షం కురుస్తుందన్నారు. అదేవిధంగా కన్నియాకుమారి, తూత్తుకుడి, సేలం, ఈరోడ్, కోయంబత్తూరు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ తుఫాను తీరాన్ని దాటే సమయంలో భారీ ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురవవచ్చని పేర్కొన్నారు.

40 వేల ఎకరాల్లో మునిగిన పంట

గత రెండు మూడు రోజులుగా డెల్టా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో 40 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. నాగపట్టణం జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు జల్లులు కురిసాయి. పుదుకోట జిల్లాలోని కోస్తాతీర ప్రాంతాలైన అరంతాంగి, మీమిసల్, కోట్టైపట్టిణం, జెగదాపట్టిణం తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. కరూర్, పెరంబలూరు, అరియలూరు, తిరుచ్చి జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. వర్షాల కారణంగా నాగపట్టణం జిల్లాలో రెండు వేల ఎకరాల్లో , వేదారణ్యం తదితర ప్రాంతాల్లో 12,500 ఎకరాల్లో పంట నీట మునిగింది. తంజావూరు జిల్లా ఒరత్తనాడు తాలూకాలోని పలు గ్రామాల్లో 500 ఎకరాల్లో పంట నీట మునిగింది.

అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దు...

తిరువారూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆసియాలోనే అతిపెద్ద అటవీ ప్రాంతంగా పేరున్న అలైయాత్తి కాట్టు అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్ళకుండా జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. తదుపరి ప్రకటన వెలువడేంత వరకు అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్ళొద్దని పేర్కొంది. ఈ నేపథ్యంలో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షానికి అటవీ ప్రాంతంలో భారీగా వర్షపు నీరు ప్రవహిస్తుంది. ఈ కారణంగా అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్ళొద్దని అటవీ శాఖ, స్థానిక అధికారులు కోరారు.

తామ్రభరణిలో వరద

తిరునల్వేలి జిల్లాలో గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు తామ్రభరణి నది పరివాహక ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. ఆ నది నుంచి రహదారులపై నీరు పొంగి ప్రవహిస్తోంది. నదీ జలాలు ప్రవేశించడంతో కుర్కుక్కుతురై మురుగన్ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో గురువారం ఉదయం ఆ ఆలయంలో జరగాల్సిన వివాహాలను మరో ప్రాంతానికి మార్చారు. ఆ ఆలయ గర్భాలయానికి భక్తులెవరూ వెళ్ళకుండా అధికారులు నిషేధం విధించడంతోపాటు గర్భాలయ ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు కూడా పెట్టారు. తామ్రభరణి నదిలోకి అదనపు జలాలు అధికంగా వస్తుండడంతో గురువారం ఉదయం నదికి రువైపులా గట్లను దాటి పొంగ్రిపవహిస్తోంది.



ఆలయ మంటపంలోకి ప్రవేశించిన వరదనీరు

రాష్ట్రపతి పర్యటనకు భారీభద్రతా ఏర్పాట్లు



చెన్నై, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరువారూరు సెంట్రల్ యూనివర్సిటీ స్నాతకోత్సవం, నీలగిరి జిల్లాలోని కున్నూరు సైనిక కళాశాల కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈ నెల 27వ తేదీ రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 27న రాష్ట్రపతి కోయంబత్తూరు సూలూరు వైమానికదళ ప్రాంతానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఊటీ తీట్టుకల్ ప్రాంతానికి వెళతారు. అక్కడి నుంచి కారులో బయలుదేరి ఊటీ రాజ్‌భవన్‌కు చేరుకుని రాత్రి అక్కడ బసచేస్తారు. మరుసటి రోజు ఉదయం ఊటీ రాజ్‌భవన్ నుంచి బయల్దేరి కున్నూరు సైనికాధికారులు శిక్షణా కళాశాలకు వెళ్ళి అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ కార్యక్రమం తరువాత మళ్ళీ ఆమె ఊటీ రాజ్‌భవన్‌కు వెళ్ళి బసచేస్తారు. ఈ నెల 29న రాజ్‌భవన్ వద్ద ఊటీ కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులను కలుసుకుంటారు. ఈ నెల 30న హెలికాప్టర్‌లో బయలుదేరి కోవై చేరుకుని అక్కడి నుంచి తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అనంతరం తిరువారూరు సెంట్రల్ యూనివర్శిటీ స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తారు. స్నాతకోత్సవం తరవాత మళ్ళీ తిరుచ్చి విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ వెళ్తారు. రాష్ట్రపతి పర్యటించే ప్రాంతాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేపడుతున్నారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్యా తన్నీరు, ఎస్పీ నిషా, జిల్లా అటవీశాఖాధికారి గౌతమ్ పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఊటీ తీట్టుకల్ హెలిపాడ్ నిర్మాణ పనులను అధికారులు గురువారం ఉదయం పరిశీలించారు. బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ ఊటీ రాజ్‌భవన్ ప్రాంతం, తిరువారూరు సెంట్రల్ యూనివర్శిటీ ప్రాంతం వద్ద తనిఖీలు చేస్తున్నారు. ఊటీ తీట్టుకల్, బోట్ హౌస్ హల్‌బంగ్, కలెక్టర్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో పోలీసులు పహరా కాస్తున్నారు.. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని సుమారు 750 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు.



'సూర్య-45'లో హీరోయిన్‌గా త్రిష? 7



కామాక్షి సురేష్ నాకెప్పుడూ అవకాశం ఇవ్వలేదు : అర్జున్ 7



శత్రు భయాలను తొలగించే పరంగిపేట్టై ముత్తుకుమారస్వామి ఆలయం 7



తంజావూరు తమిళ వర్సిటీ వీసీ తిరువళ్లువన్‌పై సస్పెన్షన్ వేటు 6

మదురైలో తూత్తుకుడి విమానం అత్యవసర ల్యాండింగ్

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి తూత్తుకుడికి బయల్దేరిన విమానం మదురైలో అత్యవసర ల్యాండింగ్ అయింది. నగరం నుంచి గురువారం ఉదయం 6 గంటలకు 70 మంది ప్రయాణికులతో తూత్తుకుడికి విమానం బయల్దేరింది. ప్రయాణికుల్లో రాష్ట్ర మంత్రి ఏపీ వేలు కూడా ఉన్నారు. ఈ విమానం ఉదయం 7.15 గంటలకు తూత్తుకుడిలో ల్యాండింగ్ కావాల్సి ఉంది. కానీ, ఆ సమయంలో అక్కడ ల్యాండింగ్ వాతావరణం అనుకూలించకపోవడంతో మదురైలో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. దీంతో, మంత్రి వేలు మదురై నుంచి కారులో తూత్తుకుడి బయల్దేరి వెళ్లారు. మిగిలిన ప్రయాణికులు కూడా వాహనాల ద్వారా తూత్తుకుడి చేరుకున్నారు. కాగా, తూత్తుకుడి నుంచి చెన్నైకు ఉదయం 7.45 గంటలకు బయల్దేరాల్సిన విమానం ఆలస్యంగా 11.15కు బయల్దేరింది.



తిరువాన్మియూరులో జరిగిన మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కుమారుడు ఎంకే ముత్తు మనవరాలు ధరణీశ్వరి, ఆకాష్‌ల వివాహావేడుకలకు సతీసమేతంగా హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తదితరులు

మణిపూర్‌లో శాంతి నెలకొల్పండి

జస్టిస్ కృష్ణకుమార్‌కు ప్రభుత్వ న్యాయవాదుల విజ్ఞప్తి

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మణిపూర్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్న మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి కృష్ణకుమార్‌కు న్యాయమూర్తులు, న్యాయవాదులు, హైకోర్టు సిబ్బంది గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వ అడ్వకేట్ జనరల్ రామన్ నేతృత్వంలో వీడ్కోలు సభ నిర్వహించగా, హైకోర్టు చీఫ్ జస్టిస్ కేఆర్ శ్రీరామ్, సీనియర్ న్యాయమూర్తి ఎస్ఎస్ సుందర్, హైకోర్టు న్యాయవాదుల సంఘం నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ముందుగా అడ్వకేట్ జనరల్ రామన్ మాట్లాడుతూ... ప్రకృతి అందాలు సంతరించుకున్న మణిపూర్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ కృష్ణకుమార్ తనకున్న రాజ్యాంగ అనుభవంతో ఆ రాష్ట్రంలో శాంతి నెలకొనేలా చర్యలు చేపట్టాలని, అక్కడి ప్రభుత్వానికి సహకరించాలని న్యాయవాదుల సంఘం తరఫున విజ్ఞప్తిచేశారు. అనంతరం హైకోర్టు సీజే కేఆర్ శ్రీరామ్ మాట్లాడుతూ... జస్టిస్ కృష్ణకుమార్‌తో తనకు సన్నిహిత సంబంధాలున్నాయని, ఆయన మద్రాసు హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా పనిచేసిన ఎనిమిదేళ్లలో 28,248 కీలక కేసులకు ముక్తాయింపు పలకడం అభినందనీయమన్నారు. కఠోరశ్రమ, నీతి నిజాయితీ స్వభావంతో తండ్రి కోరిక పూర్తిచేసి ప్రస్తుతం మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారని, ఆయన సేవలు ఆ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. కాగా వీడ్కోలు సభలో తనకు శుభాకాంక్షలు తెలిపి అభినందించిన న్యాయమూర్తులు, న్యాయవాదులకు సభాముఖంగా జస్టిస్ కృష్ణకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మద్రాసు హైకోర్టు అనేది ఒక ఉమ్మడి కుటుంబమని, అందులో ఎనిమిదేళ్లు పనిచేయడం గర్వంగా భావిస్తున్నట్లు తెలిపారు. మణిపూర్ రాష్ట్రంలో విధ్వంస సంఘటనలు ఇంకా సద్దుమణగలేదని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తాను ఆ రాష్ట్ర హైకోర్టు సీజేగా వెళ్లడం సవాళ్లతో కూడిన బాధ్యతన్నారు. సమాజంలో మార్పునకు గొప్పశక్తివంతమైన ఆయుధం చట్టమని గ్రహించి న్యాయవాదులు వ్యవహరించాలని జస్టిస్ కృష్ణకుమార్ సూచించారు. కాగా, ఆయన మణిపూర్ చీఫ్ జస్టిస్‌గా వెళ్లడం వల్ల మద్రాసు హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 66కి తగ్గింది.



మణిపూర్ హైకోర్టు సీజేగా నియమితులైన సీనియర్ న్యాయమూర్తి కృష్ణకుమార్‌తో చీఫ్ జస్టిస్ కేఆర్ శ్రీరామ్, జస్టిస్ ఎస్ఎస్ సుందర్

వన్‌సైడ్ లవ్ కాదు.. ఇద్దరం ప్రేమించుకున్నాం

● టీచర్ హత్య కేసు నిందితుడు మదన్‌కుమార్ వాంగ్మూలం



మదన్‌కుమార్, రమణి (ఫైల్‌ఫోటో)

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తంజావూరులో టీచర్ రమణి హత్యకు కారణమైన మదనకుమార్ విచారణలో పోలీసులకు సంచలన విషయాలు వెల్లడించాడు. తామిద్దరం సుదీర్ఘకాలంగా ప్రేమించుకుంటున్నామని వివరించాడు. ఆ మేరకు పోలీసులకు రాతపూర్వకంగా వాంగ్మూలం ఇచ్చాడు. తంజావూరు జిల్లా మల్లిపట్టినం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠాలు చెబుతున్న రమణిని తరగతి గదిలోనే దారుణంగా హతమార్చిన సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్రకలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ హత్యకు పాల్పడిన మదన్‌కుమార్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో... రమణి, తాను ఒకే వీధిలో నివసిస్తూ చిన్నప్పటి నుంచి స్నేహితులమని, పదో తరగతి వరకు కలిసి చదువుకున్నామని, ఆ స్నేహం కొన్నాళ్లకు ప్రేమగామారిందని, ఆమె కోసమే తాను సింగపూర్ వెళ్ళి నెలకు లక్ష రూపాయల జీతంతో ఉద్యోగం చేశానని తెలిపాడు. ఆమె కోసం సింగపూర్ ఉద్యోగం వదిలి స్వస్థలానికి వచ్చి కుల వృత్తి చేపట్టినట్టు వెల్లడించాడు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తనకు పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించడంతో రమణి, తాను ఎన్నో ఏళ్లుగా ప్రేమించుకుంటున్న విషయాన్ని తెలిపానని మదన్‌కుమార్ వివరించాడు. తమ ప్రేమను అంగీకరించిన తల్లిదండ్రులు రమణి ఇంటికి వెళ్లగా.. జాతకం సరిగా లేదంటూ కుంటిసాకులు చెప్పడంతో పాటు కులపరంగా దూషించారన్నాడు. ఆ తర్వాత రమణిని పలుమార్లు కలిసి తమ పెళ్ళికి ఆమె తల్లిదండ్రుల అంగీకారం పొందాలని అడగ్గా.. ఆమె కూడా అంగీకరించిందని, కానీ చివరకు తనను పెళ్ళి చేసుకోవడానికి నిరాకరించడం వల్లే తనకు కోపం వచ్చిందన్నాడు. తన జీవితం మొత్తం ఆమె చుట్టూనే తిరిగిందని, ఆఖరికి తనను నిర్లక్ష్యం చేయడం వల్లనే ఆ పనికి ఒడిగట్టానని వివరించాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలను పోలీసులకు అందించాడు. ఈ మేరకు పోలీసులు మదన్‌కుమార్ వాంగ్మూలాన్ని రాతపూర్వకంగా నమోదు చేసుకున్నారు.

టీచర్ల ఆందోళన..

తమిళ టీచర్ రమణి హత్యా సంఘటనను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ఉన్నత పాఠశాలల పట్టభద్రులైన ఉపాధ్యాయుల సంఘం తదితర సంఘాలకు చెందిన ఉపాధ్యాయులంతా విధులను బహిష్కరించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. హత్యకు గురైన రమణి కుటుంబీకులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల సాయంతో సరిపెట్టుకోకుండా మరో ఐదు లక్షలు సాయంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆందోళనలో పాల్గొన్న ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఇదే విధంగా రాష్ట్ర ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఐదుగంటలకు జిల్లా విద్యాశాఖాధికారుల కార్యాలయాల వద్ద ధర్నా జరిపారు.

రెండాకులపై కమలం విరిసేనా?

- **అన్నాడీఎంకేతో పొత్తుకు బీజేపీ ప్రయత్నాలు?!**
- **టీవీకేపై విమర్శలు వద్దంటూ నేతలకు సూచన**

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఇక పదిహేను నెలలే గడువుండటంతో ఆ లోగా బలమైన కూటమి రూపొందించుకుని బరిలోకి దిగాలని బీజేపీ రాష్ట్ర శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకేతో చెలిమికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అంతేగాక సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)పై విమర్శలు చేయవద్దంటూ పార్టీ నాయకులకు సూచించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే విజయానికి ఆ పార్టీ నాయకత్వంలో ఏర్పడిన బలమైన కూటమే కారణమని బీజేపీ రాష్ట్ర నాయకులు భావిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ వేర్వేరుగా కూటములుగా ఏర్పడి పోటీ చేయడం వల్లే ఒక్కసీటు కూడా గెలుచుకోలేకపోయామని గ్రహించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో వేర్వేరు కూటములుగా పోటీ చేయకుండా, కలిసికట్టుగా డీఎంకేని ఓడించేందుకు ప్రయత్నించాలని బీజేపీ నేతలు నిర్ణయించుకున్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకునే పరిస్థితులు లేవని టీవీకే ప్రకటించినప్పటికీ, ఎన్నికలు సమీపిస్తున్న వేళ తన మనస్సు మార్చుకుంటుందని బీజేపీ నేతలు గట్టిగా తలపోస్తున్నారు. టీవీకే, అన్నాడీఎంకే పార్టీలతో పొత్తు ఏర్పాటు చేసుకుంటే బీజేపీ నాయకత్వంలో ఎన్డీయే రాష్ట్రంలో విజయ ఢంకా మోగించడం ఖాయమని ఆ పార్టీనేతలు అన్నామలై, హెచ్.రాజా, పొన్ రాధాకృష్ణన్ చెబుతున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోబోమంటూ అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పదేపదే చెబుతున్నా, ఎన్నికలు సమీపించే వేళ ఆయన మనసు మార్చుకుని ఎన్డీయేలో చేరతారని బీజేపీ నేతలు భావిస్తున్నారు. కొత్తగా రాజకీయ ప్రవేశం చేసిన విజయ్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు కుదుర్చుకుంటామని పరోక్షంగా ప్రకటించారు. తమ పార్టీ కూటమిలో చేరితే అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామంటూ విక్రవాండి మహానాడులో విజయ్ చేసిన ప్రకటన అన్నాడీఎంకేని తన కూటమిలో చేర్చుకోవడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టేనని ఆ పార్టీ నాయకులు సైతం చెబుతున్నారు. బీజేపీ రాష్ట్ర సమన్వయకమిటీ అధ్యక్షుడు హెచ్.రాజా నాయకత్వంలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో ఈ అంశాలన్నీ చర్చకు వచ్చాయి. ఆ సమావేశంలో సీనియర్ నేతలు పొన్ రాధాకృష్ణన్, డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, వానతి శ్రీనివాసన్, నయినార్ నాగేంద్రన్, కరుప్పు మురుగానందం, కనకసభాపతి, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జులు అరవింద్ మేనన్, పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీజేపీపై అన్నాడీఎంకే నేతలు పనిగట్టుకుని చేస్తున్న విమర్శలను పార్టీ నిర్వాహకులు కొందరు ఆ ఇద్దరు నేతల దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్‌లు ఆయా నేతలకు నచ్చచెప్పినట్లు తెలిసింది. అన్నాడీఎంకే విమర్శలను పట్టించుకోకూడదని, పార్టీ అధిష్టానం ఆ పార్టీని కూటమిలో చేర్చుకునే అవకాశాలు లేకపోలేదని, అన్నాడీఎంకే, టీవీకేలపై విమర్శలు చేయొద్దని డీఎంకే అందరి ఉమ్మడి శత్రువని, దాని మిత్రపక్షాలపైనే విమర్శలు చేయాలని స్పష్టం చేసినట్లు సమాచారం.

సమాచార దర్శిని

24 నుంచి ఉచిత యోగా తరగతులు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ సత్యానంద యోగా కేంద్రం ఆధ్వర్యంలో నాలుగు వారాల ఉచిత యోగా తరగతులు ఈనెల 24వతేది నుంచి ప్రారంభం కానున్నాయి. టి.నగర్ గిరి రోడ్డులోని బెంగాల్ అసోసియేషన్ భవనంలో ఉదయం 5.30 నుంచి 7గంటల వరకు తరగతులు జరుగను న్నాయి.ఆసక్తి ఉన్నవారు 6383008358, 9445051015 అనే నెంబర్లు సంప్రదించి పేరు నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

పీజీ వైద్య విద్యార్థుల కాంట్రాక్ట్ సర్వీస్ తగ్గింపు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ విద్యార్థులకు తప్పనిసరి కాంట్రాక్ట్ వ్యవధిని 2 సంవత్సరాల నుంచి సంవత్సరానికి తగ్గించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ విద్యార్థులు 2 సంవత్సరాలు ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేయాలనే నిబంధన ఉంది. విద్యార్థుల కోరిక మేరకు కాంట్రాక్ట్ వ్యవధిని రెండేళ్ల నుంచి ఏడాదికి తగ్గించినట్లు అధికారులు తెలిపారు.

25 నుంచి వైద్యకోర్సుల ప్రత్యేక కౌన్సెలింగ్

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్యకళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 25వ తేది నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వైద్య విద్య డైరెక్టరేట్ తెలిపింది. ప్రస్తుత విద్యా సంవత్సరం వైద్య కోర్సుల సీట్ల భర్తీకి నిర్వహించిన కౌన్సెలింగ్ పూర్తికాగా, 135 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ సీట్లతో పాటు అన్నై వైద్య కళాశాల, ఎంజీఆర్ వైద్య కళాశాలలకు అదనంగా కేటాయించిన తలా 50 సీట్లను కూడా ఈ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేయనున్నట్లు వైద్య విద్య డైరెక్టరేట్ తెలిపింది.

రూ.16,500 కోట్ల పంట రుణాలు

పెరంబూర్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): రైతులకు రూ.16,500 కోట్ల పంట రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ధేశించినట్లు రాష్ట్ర సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు. నగరంలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 6 ప్రాథమిక సహకార సంఘాలు సిటీ కొ-ఆపరేటివ్ సంఘాలుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. గ్రామీణ బ్యాంకుల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు కొనసాగుతాయన్నారు. పంటరుణాల మాఫీ విషయంలో కొంత గందరగోళం నెలకొందని, వాటిని సరిదిద్దేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

టెన్త్, ప్లస్ టూ మోడల్ క్వశ్చన్ పేపర్లు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షలు రాసే టెన్త్, ప్లస్ టూ విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేందుకు మోడల్ క్వశ్చన్ పేపర్లు తీసుకువచ్చారు. నిపుణులతో తమిళం,ఆంగ్లంలో ముద్రించిన మోడల్ క్వశ్చన్ పేపర్ పుస్తకాలు విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది. టెన్త్ విద్యార్థులకు 3, ప్లస్ టూ విద్యార్థులకు 8 మొత్తం 11 పుస్తకాలు సిద్ధం చేసి జిల్లా విక్రయ కేంద్రాలకు పంపించారు. కనిష్టంగా రూ.70 నుంచి అధికంగా రూ.175 వరకు పుస్తకాలు విక్రయానికి ఉంచినట్లు అధికారులు తెలిపారు.

4 నుంచి పోలీసులకు శిక్షణ

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖలో కొత్తగా ఎంపిక చేసిన 621 మంది ఎస్‌ఐలు, 2,559 మంది సెకండరీ గ్రేడ్ కానిస్టేబుళ్లకు డిసెంబరు 4వ తేది నుంచి శిక్షణ ప్రారంభం కానుంది. ఊనమాంజేరిలోని పోలీసు శిక్షణా పాఠశాలలో శిక్షణ ఇవ్వనున్నారు అలాగే, కొత్తగా ఎంపిక చేసిన సెకండరీ గ్రేడ్ కానిస్టేబుళ్లు, ఎస్‌ఐలు మొత్తం 1,000 మందికి త్వరలో ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులు అందజేయనున్నారని పోలీసు శాఖ తెలియజేసింది.

సెమ్మంజేరిలో రూ.1.62 కోట్లతో స్విమ్మింగ్ పూల్

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీసీసీ ఆధ్వర్యంలో సెమ్మంజేరిలో రూ.1.62 కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మించనున్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో మెరీనా, పెరియమేడు మేలడి పార్క్, తిరువొత్తియూర్ తదితర ప్రాంతాలు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో మొగప్పైర్, వేళచ్చేరి తదితర ప్రాంతాల్లో స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయి. స్విమ్మింగ్ పూల్స్ సంఖ్య పెంచాలని నిర్ణయించిన జీసీసీ, అందుకు అవసరమైన స్థలాలు ఎంపిక చేసే పనులు చేపట్టింది. ఆ ప్రకారం, జీసీసీ ఆధ్వర్యంలో నాలుగో స్విమ్మింగ్ పూల్ షోలింగనల్లూర్ మండలం 200వ వార్డులో ఓఎంఆర్ సమీపంలోని సెమ్మంజేరిలో ఏర్పాటుకానుంది. జనవరిలో పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు జీసీసీ అధికారులు తెలిపారు.

అన్నా వర్సిటీలో రోజువారీ వేతనంపై ప్రొఫెసర్ల నియామకం

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో ఔట్ సోర్సింగ్ విధానంలో ప్రొఫెసర్లను నియమించాలని వర్సిటీ సిండికేట్ సమావేశంలో నిర్ణయించారు. విద్యార్థులబోధనకు ఇబ్బందిరాకుండా ఖాళీ ప్రొఫెసర్ పోస్టులను సత్వరం ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఇప్పటికే ఈ వర్సిటీలో పలు పోస్టులు తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తుండం గమనార్హం.

నేడు డీఎంకే ఎంపీల సమావేశం

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా అరివాయంలో శుక్రవారం రాత్రి 7 గంటలకు డీఎంకే ఎంపీల సమావేశం జరుగనుంది. ఈ నెల 25 నుంచి పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో, పార్లమెంటు సమావేశాల్లో మాట్లాడాల్సిన అంశాలు, ముఖ్యంగా, రాష్ట్రానికి నిధుల కేటాయింపు పెంపు, రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులు తదితరాలపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.




సాంస్కృతిక కార్యక్రమాల్లో తెలుగువారు - వనభోజనాల్లో ప్రముఖులు

వామ్ ఆధ్వర్యంలో వనభోజనాలు

- ఉసిరిక చెట్టుకు పూజలు
- పేదలకు సహాయాలు

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) గ్రేటర్ చెన్నై విభాగం ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక మాసం పూజలు నిర్వహించి చిన్నారులు, పెద్దలు భక్తిని చాటుకున్నారు. నగర శివారు ప్రాంతం జంబోడా గ్రామంలో ఉన్న వన్ యారో లేఔట్‌లో ఉన్న మామిడి తోటలో ఇటీవల వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ పర్యవేక్షణలో తంగుటూరి రమాదేవి, రాజ్యలక్ష్మి నిర్వహణలో నిర్వహించిన ఈ వేడుకలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శివ పూజ, లింగాభిషేకం, ఉసిరి చెట్టు పూజలు, హారతులు, ఉసిరిక దీపాలతో మహిళలు పూజలు నిర్వహించారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఆటాపాటలు, పోటీలతో సందడి చేశారు. చివరగా మహిళలందరికీ పసుపు కుంకుమలు, బహుమతులు ప్రదానం చేశారు. జంబోడ గ్రామంలోని వంద మంది పేదలకు తంగుటూరి సాయి చందన్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి రాజశేఖర్, ఎంవీ నారాయణ గుప్తా, మోతీష్‌కుమార్, వి.హరినాథ్, శ్రీలత, కేకే త్రినాద్, బెల్లంకొండ సాంబశివరావు, పొన్నూరు రంగనాయకులు, కె.శరత్‌కుమార్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

కమనీయం... సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి ఎంకేబీ నగర్‌లోని వలంపురి వ్యాస వినాయగర్ ఆలయంలో బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. 30 ఏళ్లకు పైగా ఉన్న ఈ ఆలయంలో మొట్టమొదటిసారిగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాల నడుమ సీతాలక్ష్మణ హనుమాన్ సమేత కోదండరామస్వామి వారి నూతన పంచలోహ విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను మూడు రోజులు ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన బుధవారం రాత్రి 7 గంటలకు పైగా నెల్లూరు జిల్లాకు చెందిన వేదగిరి నరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మాధవగిరి లక్ష్మీ నరసింహమూర్తి శిష్యబృందం, సీతారాముల కల్యాణం జరిపించారు. ఈ మూడు రోజుల వేడుకలను మొలగనూరు విజయకుమార్-సురేఖ, మల్లాపు నారాయణ-సునీత దంపతులు నిర్వహించి, భక్తులకు తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యుత్ శాఖకు అదానీ సంస్థతో సంబంధాల్లేవు

- మంత్రి సెంథిల్ బాలాజి

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అదాని సంస్థతో తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ)కి వ్యాపారరీత్యా మూడేళ్లుగా ఎలాంటి సంబంధాలు లేవని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ పేర్కొన్నారు. అదానీ సంస్థతో టీఎన్‌ఈబీకి సంబంధాలున్నాయని సోషల్ మీడియాలో ప్రత్యేక కథనాలు వైరలవుతున్న నేపథ్యంలో, దీనిపై స్పందించిన మంత్రి సెంథిల్ బాలాజీ గురువారం ఓ ప్రకటన విడుదలచేశారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలు దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని విద్యుత్ బోర్డుతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 1,500 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ సంస్థ అని, ఆ సంస్థతోనే మిగతా రాష్ట్రాలు కూడా విద్యుత్ కొనుగోలుకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంటున్నాయన్నారు. విద్యుత్ కొనుగోలుపై ఏవన్నా అనుమానాలుంటే వాటిని కూడా స్పష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు.

సీబీఐ విచారణపై ఈపీఎస్ ద్వంద్వ వైఖరి

- డీఎంకే నేత ఆర్ఎస్ భారతి ఆరోపణ

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సీబీఐ విచారణపై తనకోవిధంగా, ఇతరులకు మరో విధంగా ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి ఆరోపించారు. అన్నా అరివాలయంలో గురువారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ కళ్లకురిచ్చి కల్తీసార సంఘటపై హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలుకు వెళ్లకూడదంటూ ఈపీఎస్ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈపీఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రహదారుల శాఖలో జరిగిన రూ.4800 కోట్ల మేరకు జరిగిన అవినీతి అక్రమాలపై విచారణకు ఆదేశించాలని కోరుతూ తాను హైకోర్టులో పిటిషన్ వేశానని, తాను అడగకపోయినా న్యాయస్థానం ఆ అవినీతిపై సీబీఐ విచారణకు ఆదేశించిందన్నారు. ఆ సమయంలో హైకోర్టు తనకు వ్యతిరేకంగా సీబీఐ విచారణకు ఆదేశించాడాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న విషయాన్ని ఆర్ఎస్ భారతి గుర్తుచేశారు. అవినీతి కేసులో తనకు వ్యతిరేకంగా సీబీఐ విచారణ జరగకూడదని అప్పీలు చేసుకున్న ఈపీఎస్, కళ్లకురిచ్చి కల్తీసారా సంఘటనపై హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించడంపై అప్పీలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించకూడదని ఎలా చెబుతారని ఆయన ధ్వజమెత్తారు. హోసూరు కోర్టు సమీపంలో లాయర్‌పై జరిగిన దాడి, తంజావూరులో టీచర్‌పై జరిగిన హత్య ప్రైవేటు వ్యక్తులు కక్షల నేపథ్యంలో చేస్తే ఆ రెండు సంఘటనల వల్ల రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఈపీఎస్ గగ్గోలు పెట్టడం మరీ వింతగా ఉందన్నారు. ఈపీఎస్ సీఎంగా ఉన్నప్పుడు మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో హత్య, హత్యాయత్నం, ఆత్మహత్య వంటి సంఘటనలు కూడా జరిగి శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించిన పాత సంగతులు ఆయనకు గుర్తుకురావటం లేదని ఆర్ఎస్‌భారతి ఎద్దేవా చేశారు.

ప్రేమలతకు అన్నాడీఎంకే ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జానకి రామచంద్రన్ శతజయంతి వేడుకలు ఈ నెల 24వ తేది వానగరంలోని శ్రీవారు వెంకటాచలపతి కల్యాణ మండపంలో జరుగనున్నాయి. ఈ వేడుకలకు డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతకు ఆహ్వానం పలికారు. మాజీ మంత్రులు ఉదయకుమార్, కడంబూరు రాజు, విజయభాస్కర్, వేంగైసెల్వన్ ఆమెను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ వేడుకల్లో, పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పిలుపునిచ్చిన నేపథ్యంలో, కూటమి పార్టీల నేతలను ఈ వేడుకలను ఆహ్వానించాలని పళనిస్వామి నిర్ణయించినట్లు పార్టీ వర్గాల సమాచారం.

నేటినుంచి ఫుట్‌పాత్ వ్యాపారులకు గుర్తింపుకార్డులు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు గుర్తింపుకార్డులు ఇచ్చే ప్రత్యేక శిబిరాలు ఈ నెల 22 నుంచి 30వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో 35,588 ఫుత్‌పాత్ దుకాణాలున్నాయన్నారు. వీరికి ఇదివరకే గుర్తింపుకార్డులిచ్చిన నేపథ్యంలో, కొత్త గుర్తింపు కార్డులు అందజేయనున్నారు. ఈ కొత్త కార్డుల్లో క్యూఆర్ కోడ్, వెబ్ లింక్ తదితరాలుంటాయన్నారు. వ్యాపారులు ఆధార్ కార్డు, పాత గుర్తింపు కార్డులతో శిబిరాలకు వచ్చి, వారి సెల్‌ఫోన్ నెంబర్లకు వచ్చే ఓటీపీ ద్వారా కొత్త కార్డులు పొందవచ్చని జీసీసీ తెలియజేసింది.

మూడు నెలల ముందుగా పింఛన్ ఖాతా వివరాలు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు పింఛన్ ప్రయోజనాలు సకాలంలో పొందేలా వారి పదవీవిరమణకు మూడు నెలల ముందే పింఛన్ ప్లాన్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌కు పంపాలని రాష్ట్ర ఆడిట్ అండ్ అకౌంట్ విభాగం జనరల్ వెల్లయంగిరి తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఏడాదికి సుమారు 20 వేల మంది పదవీ విరమణ చేస్తున్నారన్నారు. పోలీసు, విద్య, రెవెన్యూ శాఖల్లో పదవీవిరమణ చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. పదవీవిరమణ సమయంలో తగిన పత్రాలు సమర్పించకపోవడంతో వారికి పింఛన్ ప్రయోజనాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. ఈ అంశం పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వ ఉద్యోగులు పదవీవిరమణ చేసే మూడు నెలలకు ముందుగానే పింఛన్ ఖాతా వివరాలు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

తంజావూరు తమిళ వర్సిటీ వీసీపై సస్పెన్షన్ వేటు

ప్యారీస్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తంజావూరులోని తమిళ వర్సిటీ వైస్ ఛాన్సలర్ తిరువళ్లువన్‌ను సస్పెండ్ చేస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు జారీచేశారు. ఈ వర్సిటీలో 40 మంది ఉద్యోగులను నియమించడంలో భారీస్థాయిలో అవినీతికి పాల్పడ్డారనే కారణంగా తిరువళ్లువన్‌పై సస్పెన్షన్ వేటుపడింది. దిండుగల్‌లోని గాంధీగ్రామ్ యూనివర్సిటీ బుధవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరువళ్లువన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు గవర్నర్ ప్రకటించారు. తంజావూరు తమిళ విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్‌గా ఉన్న తిరువళ్లువన్ పదవీకాలం ఇంకా 22 నెలలున్న నేపథ్యంలో, ఆయన సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాల్లోకి వెళితే... ఈ వర్సిటీలో 2017,2018 సంవత్సరాల్లో 40 మంది ఉద్యోగులను నియమించారు. ఇందులో అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ జరపాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు, రిటైర్డ్ జడ్జి జయచంద్రన్ నేతృత్వంలో కమిటీని నియమించింది. ఈ కమిటీ జరిపిన విచారణలో, ఉద్యోగుల నియామకంలో అవినీతి జరిగిందని నిర్ధారించింది. ఈ నివేదిక ఆధారంగా తిరువళ్లువన్‌ను సస్పెండ్ చేస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీచేయడం గమనార్హం.

సామ్‌సంగ్ కార్మికుల ఆందోళనకు హైకోర్టు అనుమతి

పెరంబూర్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): సామ్‌సంగ్ సంస్థకు వ్యతిరేకంగా నిరాహారదీక్ష మినహా ఇతర ఆందోళనలు చేపట్టేందుకు మద్రాసు హైకోర్టు అనుమతించింది. సామ్‌సంగ్ కంపెనీలో కార్మిక సంఘం ఏర్పాటుకు అనుమతించాలని కోరుతూ ఆ సంస్థ కార్మికులు ఆందోళనలు చేపట్టారు. అనంతరం కోర్టు, ప్రభుత్వం జోక్యంతో కార్మికులు సమ్మె విరమించుకున్నారు. ఆందోళనలో పాల్గొన్న కార్మికులపై ఎలాంటి కక్షపూరిత చర్యలకు పాల్పడరాదని హైకోర్టు తెలిపింది.ఈనేపథ్యంలో, ఎస్‌హెచ్ ఎలక్ట్రానిక్స్ సంస్థలో పనిచేస్తున్న 91 మంది కార్మికులను విధుల నుంచి తొలగించారు. తొలగించిన కార్మికులను వెంటనే ఉద్యోగంలోకి తీసుకొనేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సీఐటీయూ కాంచీపురం జిల్లా కార్యదర్శి ముత్తుకుమార్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దానిని విచారించిన న్యాయస్థానం, ఈ నెల 30న సామ్‌సంగ్ కార్మికులు నిరాహారదీక్ష మినహా ఇతర ఆందోళన చేపట్టేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

మద్యం మత్తులో బస్సు నడిపిన మెకానిక్

- కూలిన అడయార్ ఠాణా ప్రహరీ గోడ

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సిటీ బస్సు నడిపిన మెకానిక్ అడయార్ పోలీస్ స్టేషన్ ప్రవరీ గోడను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ప్రహరీగోడ పక్కనే పార్కింగ్ చేసివున్న ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. గురువారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలను పరిశీలిస్తే, అడయార్‌లోని ఎంటీసీ బస్సు డిపోలో గుణశేఖరన్ (50) అనే వ్యక్తి మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా గత పది రోజులుగా సస్పెన్షన్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మద్యం సేవించి వచ్చి, అక్కడ ఉన్న పోలీసులతో గొడవకు దిగాడు. ఆ తర్వాత డిపోలోకి వెళ్లి బస్సు స్టార్ట్ చేసి రాంగ్ రూట్‌లో వచ్చి పోలీస్ స్టేషన్ ప్రహరీ గోడను ఢీకొట్టాడు. దీంతో ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలపై ప్రవహరీ గోడ శిథిలాలు పడటంతో వాహనాలు బాగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో డిపో సిబ్బందితో పాటు పోలీసులు ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. ఆ తర్వాత గుణశేఖరన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోనున్నట్టు పోలీసులు తెలిపారు.

వేలం పాట పేరిట మోసం

- నలుగురి అరెస్టు

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలో వేలం పాటల పేరులో ఓ గ్రామానికి చెందిన అనేక మందిని మోసం చేసిన కేసులో పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని ఊటీ కీళతలైయాట్టుమందు ప్రాంతానికి చెందిన కుమార్ (51), ఈయన భార్య లత (46), కుమారుడు రాహుల్ (23), కుమార్ సోదరుడు సహదేవన్ (48)గా గుర్తించారు. వీరంతా కలిసి ఆ గ్రామంలో వేలం పాటలు నిర్వహించేవారు. 50మంది సభ్యులతో రూ.1.50 లక్షలు, 25 మంది సభ్యులతో రూ.1.35 లక్షలు, 35 మందితో రూ.1.05 లక్షల విలువతో కూడిన వేలం పాటలు నిర్వహించేవారు. అయితే, వేలం పాటలు ముగిసినా మదుపరులకు డబ్బు చెల్లించకపోగా, వారిని నిలదీసినా సరైన స్పందన లేకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి మోసం చేసిన నలుగురిని అరెస్టు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పెరుంబాక్కం-మేడవాక్కం-పళ్లికరనై: కైలాష్ నగర్, ఆంటోని నగర్, కృష్ణా నగర్, రాధ నగర్, సౌమ్య నగర్, మాంబాక్కం మెయిన్ రోడ్డు, గాంధీ నగర్, నూక్కన్‌పాళయం రోడ్డు (కొంత భాగం), చేరన్ నగర్, బాబు నగర్, సీబీఐ కాలని, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, పొన్నియమ్మన్ ఆలయ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, పల్లవన్ నగర్, ఎల్లార్ అవెన్యూ, మునుస్వామి నగర్, మేడవాక్కం మెయిన్ రోడ్డు, రంగనాథపురం, పటేల్ రోడ్డు, ప్రిన్స్ కాలేజ్, శివగామి నగర్, సరస్వతి నగర్, నల్లతంబి నగర్, ఏరికరై రోడ్డు, విమలా నగర్, మీనాక్షి నగర్, రాజలక్ష్మి నగర్, సాయిగణేశ్ నగర్, సాయిబాలాజి నగర్, రాజా నగర్, ఆర్ఎస్ నగర్, శఠగోపన్ నగర్, జల్లడంపేట ప్రాంతం, కృష్ణా నగర్, ధర్మలింగం నగర్, వివేకానంద నగర్, వల్లల్ పారినగర్, గణపతి పురం

మీనవర్ బజార్, పార్క్ టౌన్, ఎస్ప్లెనేడ్, మన్నడి: ఎన్ఎస్సీ బోస్ రోడ్డు, ప్రేజియర్ బ్రిడ్జి రోడ్డు, ఈవెనింగ్ బజార్, దేవరాజ్ మొదలి వీధి (కొంత భాగం), తంగ శాలై (కొంత భాగం), నైనియప్పన్ నాయకన్ వీధి, గెంగురామ్ వీధి, రఘునాయకులు వీధి, బెత్తనాయకన్ వీధి, ఈవీఆర్ రోడ్డు, ఐసక్ వీధి, పరమశివం వీధి, వెంగు వీధి, మన్నార్ వీధి, కుళందై వీధి, వాల్‌టాక్స్ రోడ్డు, పొన్నప్ప వీధి, రాజప్ప వీధి, సుబ్బు వీధి, కాలప్ప వీధి, అమ్మన్ ఆలయ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, సముద్ర మొదలి వీధి, ఈకే అగ్రహారం వీధి, బందర్ వీధి, బద్రియన్ వీధి, స్ట్రింగర్ వీధి, పాత పెరుమాళ్ వీధి, బ్రాడ్‌వే, అండర్సన్ వీధి, సెంబుటూస్ వీధి, కూమ్స్ వీధి, ఫ్రాన్సిస్ జోసఫ్ వీధి, సుకువార్ అగ్రహారం వీధి, మెక్లిన్ వీధి, పెరియన్న వీధి

ఇంజంబాక్కం: అక్కరై మెట్రో వర్క్స్, మందిరి విల్లా, ప్రెస్టేజ్ సిల్వర్ స్ప్రింగ్ విల్లా, ఎంజీఆర్ నగర్, కేకే రోడ్డు, స్ప్రింగ్ గార్డన్, కడల్‌పారై, కాపర్ బీచ్, సన్‌రైజ్ అవెన్యూ, ఎల్జీ అవెన్యూ, స్పార్కలింగ్ సాంట్ అవెన్యూ

తిరుముల్లైవాయల్: మోరై, మోరై ఇండస్ట్రీస్, వేల్‌టెక్ మెయిన్ రోడ్డు, షీలా నగర్, విజయలక్ష్మి నగర్, శ్రీనివాస నగర్, సప్తగిరి నగర్, భార్గవి నగర్.

లంచం కేసులో 17 ఏళ్ల తర్వాత తీర్పు

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టాలో పేరు మార్పునకు రూ.10వేలు లంచం తీసుకున్న కేసులో 17 ఏళ్ల అనంతరం కోర్టు తీర్పు చెప్పింది. తిరుప్పూర్ జిల్లా గోపి వాయక్కాల్‌మేడు ప్రాంతానికి చెందిన కరుప్పస్వామి తనకు చెందిన కున్నత్తూర్, సుండక్కాంపాళయం ప్రాంతాల్లోని భూముల పట్టాల్లో పేరు మార్చాలని కున్నత్తూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2007లో దరఖాస్తు చేసుకున్నాడు. పేరు మార్పునకు సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖరన్ రూ.10వేలు లంచం అడగడంతో కరుప్పస్వామి జిల్లా అవినీతి శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారి సూచనల మేరకు అదే ఏడాది జూన్ 12వ తేది కరుప్పస్వామి సబ్ రిజిస్ట్రార్‌కు లంచం ఇస్తుండగా అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసు తిరుప్పూర్ ప్రధాన క్రిమినల్ కోర్టులో విచారణ జరుగుతుండగా, 17 ఏళ్ల అనంతరం అప్పటి సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖరన్ (ప్రస్తుతం 69 ఏళ్లు)కు మూడేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి చెల్లదురై బుధవారం తీర్పు వెలువరించారు.

జేజే నగర్‌లో రౌడీ ముఠా అరెస్ట్

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేజే నగర్‌లో పాతకక్షల కారణంగా ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఏడుగురు రౌడీలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎలిఫెంట్‌గేట్ ప్రాంతానికి చెందిన నెడుంజెళియన్ 2005లో వీధి కొళాయి వద్ద తాగునీరు నింపడంలో ఇరువర్గాల మధ్య ఏర్పడిన వాగ్వివాదం హత్యకు దారితీసింది. ఈ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని మృతుడు నెడుంజెళియన్ సోదరుడు కందన్, అతడి అనుచరులు పథకం వేశారు. ఈ నేపథ్యంలో, నెడుంజెళియన్ హత్య కేసుతో సంబంధాలున్న తిరుమంగళం ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్ (45)న జూన్ 14వ తేది రాత్రి ఏడుగురు ముఠా మారణాయుధాలతో దాడిచేసి పరారైంది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసన్ కీల్పాక్కం ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. ఈ ఘటనలో షావుకారుపేటకు చెందిన రౌడీలు ప్రశాంత్‌కుమార్ (26), సాధిక్ (29), రాజేష్ (36) సహా ఏడుగురిని పోలీసులు బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు.

మెడికో ఆత్మహత్య

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానిక మాంగాడు సమీపంలో చోటుచేసుకుంది. మాంగాడు పద్మావతి నగర్‌కు చెందిన సౌందర్‌రాజన్ కుమారుడు రాజ్‌కుమార్ (25) వేలప్పన్‌చావిడిలోని ఓ ప్రైవేటు వైద్యకళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. కొద్దిరోజులుగా చదువులో వెనుకబడిన రాజ్‌కుమార్ మనస్తాపంతో ఉంటూ కళాశాలలకు వెళ్లడం లేదని సమాచారం. ఈ విషయమై కళాశాల యాజమాన్యం, రాజ్‌కుమార్‌కు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తామని సౌందర్‌రాజన్‌కు తెలిపింది. బుధవారం కౌన్సెలింగ్‌కు వెళ్లిన రాజ్‌కుమార్ ఇంటికి తిరిగివచ్చి తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహంతో తన గదిలోకి వెళ్లిన రాజ్‌కుమార్, ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానించిన తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లగా, ఫ్యానుకు ఉరేసుకొని మృతిచెందిన రాజ్‌కుమార్‌ను చూసి బోరున విలపించారు. ఈ ఘటనపై మాంగాడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుచెందూరు తీరంలో అలల తాకిడి

- ఇద్దరు మహిళలకు గాయాలు



గాయపడిన మహిళను తీసుకెళుతున్న సముద్రతీర భద్రతా సిబ్బంది

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు ఆలయ సమీపంలోని సముద్రతీరంలో గురువారం అలల తాకిడి అధికమైంది. తీరం పొడవునా ఐదు నుండి ఆరడుగుల ఎత్తున అలలు ఎగసిపడ్డాయి. అదే సమయంలో అక్కడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించేందుకు, సముద్రం ఒడ్డున స్నానం చేసేందుకు కారైక్కుడికి చెందిన శివకామి (50), చెన్నై నగరానికి చెందిన కీర్తన (40) వెళ్లారు. ఇద్దరూ స్నానం చేస్తుండగా ఓ రాక్షస అల వారివైపు దూసుకురావటంతో కిందపడ్డారు. ఈ సంఘటనలో వారి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సముద్రతీర భద్రతాదళ సిబ్బంది వెంటనే వారిని స్ట్రెచర్‌పై మోసుకెళ్లి అంబులెన్స్‌లో ఎక్కించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

చిన్నారులపై లైంగిక వేధింపులు

- పూజారి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శివగంగ సమీపంలో బాలుడు, బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఫిర్యాదులో ఓ పూజారి కటకటాలపాలయ్యాడు. ఆలయంలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు వచ్చిన బాలుడు, బాలికను పూజారి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు సమాచారం. పిల్లల భద్రతాధికారి అందజేసిన ఫిర్యాదుతో పూజారిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

బిచ్చగాడి ప్రాణం తీసిన బీడీ ముక్క

- సహచరుడే నిందితుడు

అడయార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాంథోమ్ చర్చి ప్రాంతంలో ఒక యాచకుడిని తోటి భిక్షగాడు హత్య చేశాడు. సగం కాల్చిన బీడీ ముక్క యాచకుడి హత్యకు కారణమైంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, శాంథోమ్ వద్ద రాత్రి వేళల్లో దాదాపు 50 మంది వరకు యాచకులు నిద్రిస్తుంటారు. ఇలాంటి వారిలో కేరళ రాష్ట్రానికి చెందిన సుకు అనే దివ్యాంగ భిక్షగాడు అక్కడే ఉంటున్నాడు. సుకు దివ్యాంగుడు కావడంతో వేళచ్చేరి ప్రాంతానికిని ఆనంద్ (42) అనే మరో బెగ్గర్ సాయం చేసేవాడు. ఈ క్రమంలో సుకు బీడీ కాల్చి సగ భాగాన్ని తన సంచిలో దాచాడు. సుకును అడగకుండా ఆ బీడీ ముక్కను ఆనంద్ తీసుకున్నారు. దీంతో సుకు కోపంగా ఆనంద్‌తో గొడవపడి కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. ఆనంద్ తప్పించుకుని సుకు తలను బలంగా గోడకు వేసి కొట్టి అక్కడ నుంచి వేళచ్చేరి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన సుకు అపస్మారకస్థితిలోకి జారుకున్నారు. దీనిని గమనించిన పాదాచారులు 108కు ఫోన్ చేశారు. 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి సుకును స్థానిక రాయపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సుకు మృతిచెందాడు. పోస్టుమార్టు నివేదికలో తలకు బలమైన గాయం తగలడంతో ప్రాణాలు కోల్పోయినట్టు తేలింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, శాంథోమ్ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ పరిశీలించగా, అసలు విషయం తెలిసింది. దీంతో వేళచ్చేరిలో ఉన్న ఆనంద్‌ను అరెస్టు చేశారు. బీడీ ముక్క విషయంలో గొడవపడటంతో దాడి చేసినట్టు అంగీకరించాడు.

హోసూరు సంఘటనను ఖండిస్తూ న్యాయవాదుల ధర్నా, రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న న్యాయవాదులు

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హోసూరు కోర్టు ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు లాయర్ కన్నన్‌పై వేటకొడవలితో దాడి చేసిన ఘటనను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పలు నగరాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి ధర్నా, రాస్తారోకోలు చేశారు. మద్రాసు హైకోర్టు న్యాయవాదులు, సైదాపేట కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి గురువారం ఆందోళనకు దిగారు. ఇదేవిధంగా తిరువొత్తియూరు కోర్టు, తాంబరం కోర్టు, తిరువళ్లూరు కోర్టు తదితర కోర్టుల వద్ద కూడా న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.



ఆంధ్రజ్యోతి, చెన్నై

తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాన్ 'ముత్తుకుమారస్వామి' పేరుతో పుణ్యక్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ప్రప్రథమమైనది 'పుళ్ళియురుక్కువేలూరు' అనే వైదీశ్వరన్ కోవిల్ క్షేత్రం. తంజావూరు జిల్లాలోని ఈ క్షేత్రంలో పరమేశ్వరుడిని పావురం (పుళ్), రుక్ (వేదం) శూలాయుధం (వేల్) ఆరాధించడం వల్ల ఆ ఆలయానికి ఆ పేరొచ్చింది. ఇదే విధంగా కడలూరు జిల్లాలో మురుగప్పెరుమాన్ ముత్తుకుమారస్వామి పేరుతో భక్తులను అనుగ్రహిస్తున్న క్షేత్రమే 'ముత్తుకృష్ణాపురి' అని పిలువబడే పరంగిపేటై. ఈ ఆలయం మురుగప్పెరుమాన్ ఆలయంగా ఉన్నప్పటికీ ఇక్కడ విశ్వనాథుడు - విశాలాక్షి పేర్లతో ఆదిదంపతులు కొలువుదీరి ఉన్నారు. అసురుల చేతిలో ఓడిన దేవేంద్రుడిని కాపాడి అనుగ్రహించినవారే ఈ విశ్వనాథస్వామి. బ్రహ్మదేవుడు పద్మాసనంతో శిష్యభావంతో దర్శనమిచ్చే ఏకైక శైవాలయం కూడా ఇదేనని శైవపండితులు చెబుతారు.



ఆలయప్రవేశద్వారం — బ్రహ్మదేవుడు — విశాలాక్షి అమ్మవారి సన్నిధి - నాగదేవతలు

విధాత, విశ్వేశ్వరుడు వెలసిన ఆలయం

● శత్రు భయాలను తొలగించే పరంగి పేటై ముత్తుకుమారస్వామి ● పద్మాసనంలో అనుగ్రహించే బ్రహ్మదేవుడు

ఆలయ విశేషాలు...

విశ్వనాథస్వామికి నిత్యపూజలతోపాటు ప్రదోష పూజలు, ఐప్పసిలో అన్నాభిషేకం, కార్తీక సోమవారాల్లో ప్రత్యేక పూజలు, మార్గశిలో ధనుర్మాస పూజలు, మాశి మహా శివరాత్రి పూజలు, మాసి మఖంలో చంద్రశేఖరస్వామివారి తీర్థవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. అమ్మవారికి శుక్రవారం సహస్రనామార్చనలు, ఆడిపూరంలో ప్రత్యేక అభిషేకాలు, అమావాస్య రోజు అర్ధజాము పూజలు, భైరవస్వామికి ప్రత్యేక అభిషేకం, దుర్గాష్టమి అభిషేకం, యేడాదిలో ఆరుసార్లు నటరాజస్వామికి మహా అభిషేకం నిర్వహిస్తారు. ముత్తుకుమారస్వామికి ప్రతి మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు శత్రుసంహార అర్చనలు, తైమాసంలో బ్రహ్మోత్సవాలు జరిపిస్తారు.

ఎలా చేరుకోవాలి ?

రాజధాని నగరం చెన్నై సహా రాష్ట్రంలోని పలు నగరాల నుంచి కడలూరుకు ప్రభుత్వ రవాణా సంస్థ, ప్రైవేటు సంస్థ బస్సులు నడుపుతున్నారు. కడలూరు బస్టాండు నుంచి పరంగిపేటై సుమారు 30 కి.మీ.లో దూరంలో ఉంది. కడలూరు నుంచి ప్రభుత్వ రవాణా సంస్థ, ప్రైవేటు రవాణా సంస్థ బస్సులు గాని ఆటోలు, టాక్సీల్లో పరంగిపేటై చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఆలయ వైభవం..

ఈ ఆలయాన్ని రెండువేల సంవత్సరాల క్రితం నిర్మించారని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. ఆలయాన్ని ఎవరు నిర్మించారనే శాసనాధారాలు కూడా లేదంటున్నారు. ధ్వజస్తంభం, నంది మండపాన్ని దాటి వెళ్తే ప్రత్యేక సన్నిధిలో వినాయకుడు దర్శనమిస్తారు. లోపలకు వెళ్ళితే మురుగప్పెరుమాన్ సన్నిధి, ఎడమవైపు విశాలాక్షి సమేత విశ్వనాథస్వామి వారి సన్నిధి దర్శించవచ్చు. ప్రాకారంలో ఆదివిశాలాక్షి సమేత ఆదివిశ్వనాథుడు, బాలసుబ్రహ్మణ్యస్వామి (షష్ఠి ఉత్సవ నాయకుడు), నాగదోషం, కళత్రదోషం, వివాహ ఆటంకాలకు గురవుతున్నవారు పూజించాల్సిన నాగర్, దేవేంద్రుడు పూజించిన మహాలక్ష్మి సన్నిధి ఉన్నాయి. శివుడి గోష్ఠంలో దక్షిణామూర్తి, బ్రహ్మదేవుడు, శివచండికేశ్వరుడు దర్శనమిస్తారు. ముత్తుకుమారస్వామి మహామండప గోష్ఠంలో దుర్గాదేవి, గుహ చండికేశ్వరస్వామి, శనీశ్వరుడు భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఏ శివాలయంలోనూ లేనట్లు ఈ ఆలయంలో బ్రహ్మదేవుడు పద్మాసనం వేసుకుని శిష్యభావంతో దర్శనమిస్తుండటం అరుదైన అంశమని శైవాగమ పండితులు చెబుతున్నారు. ఇదే విధంగా ఈ శివాలయంలో రెండు సన్నిధుల్లో చండికేశ్వర్లు ఉండటం కూడా మరీ విశేషమంటున్నారు. ముత్తుకుమారస్వామి గర్భాలయానికి పక్కనే అర్థమండపంలో నటరాజ సభ, మహామండపం వద్ద నవగ్రహాల సన్నిధి ఉంది. వెలుపలి ప్రాకారంలో ఆలయానికి ఈశాన్య దిశలో సూర్యభగవానుడు, భైరవుడు, నవవీరుల సన్నిధులున్నాయి.



వళ్ళీ, దేవసేనా సమేత ముత్తుకుమారస్వామి



విశాలాక్షి సమేత శ్రీవిశ్వనాథస్వామి

స్థలపురాణం..

పూర్వం నముశి అనే రాక్షసుడు ఏ ఆయుధం వలన మరణం లేని వరాన్ని పరమేశ్వరుడిని ఆరాధించి పొందాడు. ఆ వర గర్వంతో దేవతలను చిత్రహింసలకు గురిచేసి, దేవేంద్రుడితో తలపడ్డాడు. దేవేంద్రుడు అతడిపై వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ వజ్రాయుధం అసురుడిని ఏమీ చేయకుండా మాయమైంది. దీంతో భీతిల్లిన దేవేంద్రుడు, కోకిల రూపంలో భూలోకం వెళ్ళి, అక్కడి అగరం ఆదిమూలేశ్వరుడి ఆలయంలో పరమశివుడి అనుగ్రహం కోసం పూజలు చేశాడు. ఆ తరువాత ముత్తుకృష్ణాపురిలో లింగాన్ని ప్రతిష్ఠించి తపమాచరించాడు. ఇంద్రుడికి ఈశ్వరుడు ప్రత్యక్షమై నముశిని సంహరించే ఉపాయం తెలిపాడు. పంచాక్షరీ మంత్రాన్ని ఉచ్చరిస్తూ సముద్రపు నురుగును ఆ రాక్షసుడిపై విసరమన్నాడు. పరమశివుడు చెప్పినట్లే దేవేంద్రుడు పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తూ సముద్రపు నురగను నముశిపై విసిరాడు. ఆ నురగ మహాయుధంగా మారి నముశిని సంహరించింది. ఇంద్రుడు మళ్ళీ తన పదవిని పొందాడు. ఇలా దేవేంద్రుడు ప్రతిష్ఠించిన లింగమే ఈ విశ్వనాథస్వామి. ముత్తుకుమారస్వామికి కుడివైపు తూర్పుదిశగా పరమేశ్వరుడు కొలువుదీరారు. భక్తులు ఇక్కడ స్వామివారికి పట్టు వస్త్రాలు పెట్టి, సాంబారన్నం, పొంగలి నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. విశాలాక్షి అమ్మవారికి చక్కెర పొంగలి, వడ నైవేద్యంగా సమర్పించి లలితా సహస్రనామం పఠిస్తుంటారు.



ముత్తుకుమారస్వామి

వియ్యంకుడు హీరో.. అల్లుడు దర్శకుడు

● నటుడు అర్జున్

తన వియ్యంకుడు కథానాయకుడిగా నటించిన చిత్రానికి మా ఇంటి అల్లుడు దర్శకత్వం వహించిన అరుదైన సంఘటన 'రాజాకిలి' చిత్రంలో చోటుచేసుకుందని యాక్షన్ కింగ్ అర్జున్ అన్నారు. 'మానాడు' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని నిర్మించిన సురేష్ కామాక్షి 'వి హౌస్' పతాకంపై నిర్మించిన చిత్రం 'రాజాకిలి ఈ నెల 29న విడుదలకానుంది. సీనియర్ నటుడు తంబి రామయ్య ప్రధాన పాత్ర పోషించగా, ఇతర పాత్రల్లో సముద్రఖని, శ్వేత, శుభ, ప్రవీణ్, క్రిష్, ముసాఫిర్, దర్శకుడు మూర్తి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. తంబి రామయ్య కుమారుడు ఉమాపతి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ విడుదల కార్యక్రమం బుధవారం రాత్రి నగరంలో జరిగింది.

కామాక్షి సురేష్ నాకు అవకాశం ఇవ్వలేదు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న యాక్షన్ కింగ్ అర్జున్ మాట్లాడుతూ, మంచి నటీనటులను ఎంపిక చేసి చిత్రాలు నిర్మిస్తారనే పేరు నిర్మాత కామాక్షి సురేష్‌కు ఉంది. కానీ, ఆయన ఇప్పటివరకు నాకు ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు' అన్నారు. కాగా 'నా అల్లుడు ఉమాపతి రామయ్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తే, వియ్యంకుడు తంబి రామయ్య కథానాయకుడిగా నటించారు. ఇది అరుదైన విషయం. నాకు స్పెషల్ మూవీ. నేను కూడా ఇప్పటి వరకు నటించని రొమాంటిక్ పాత్ర తంబి రామయ్య పోషించారు. నేను, నా అల్లుడు కలిసి ఒకే వేదిక పంచుకోవడం ఇదే తొలిసారి. భవిష్యత్‌లో ఇలాంటి వేదికలు మరిన్ని చూస్తారు. నటుడు సముద్రఖని మాట్లాడుతూ, 'ఎవరికి ఏం ఇవ్వాలో కాలమే నిర్ణయిస్తుంది' అన్నారు. తంబి రామయ్య మాట్లాడుతూ, 'వినోదయ సిత్తం' అనే చిత్రం లేకుంటే ఇపుడు ఈ సినిమా లేదన్నారు. నిర్మాత సురేష్ మాట్లాడుతూ, "రాజాకిలి'లో దివంగత నటుడు రఘువరన్‌కు మరో వెర్షన్‌గా క్రిష్‌ను చూస్తారన్నారు. దర్శకుడు ఉమాపతి మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం మా నాన్నను ఎంతో కష్టపెట్టాను. నేలపై నూనె పోసి నటింపజేశాను' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు, సంగీతం తంబి రామయ్య సమకూర్చడం గమనార్హం.



'రాజాకిలి' ఆడియో రిలీజ్ దృశ్యం



'సూర్య-45'లో త్రిషకు ఛాన్స్?

దర్శకనటుడు ఆర్జే బాలాజీ, హీరో సూర్య కాంబినేషన్‌లో రూపొందనున్న 'సూర్య-45' చిత్రంలో త్రిషను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. అయితే, హీరోయిన్ ఎంపికపై త్వరలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటించను న్నారు. ఈ ప్రాజెక్టు ఈ నెలాఖరులో సెట్స్‌పైకి వెళ్ళనుంది. ఇందులో నటించే నటీనటుల ఎంపికపై దర్శకుడు నిమగ్నమైవున్నారు. ఈ నేపథ్యంలో హీరోయిన్‌గా త్రిష సంతకం చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇంకా పేరు పెట్టని 'సూర్య-45' ప్రాజెక్టుకు సంగీతం ఏఆర్.రెహ్మాన్. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు సంయుక్తంగా నిర్మించనున్నారు. సూర్య-త్రిష కాంబినేషన్‌లో గతంలో 'ఆరు' అనే చిత్రం రాగా సూపర్‌హిట్ అయింది. చాలాకాలం తర్వాత వీరిద్దరూ మళ్ళీ కలిసి నటించనున్నారు.

ఎట్టకేలకు వచ్చే నెలలో 'సూదు కవ్వుం-2' విడుదల

చిత్రజ్యోతి

కమెడియన్ కమ్ హీరో మిర్చి శివ నటించిన 'సూదు కవ్వుం-2' సినిమా వచ్చే నెల 13వ తేదీ విడుదలకానుంది. గతంలో నలన్ కుమారస్వామి దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నటించిన ఈ చిత్రం తొలిభాగంలో నటించారు. ఇందులో బాబీ సింహా, సంచిత శెట్టి, అశోక్ సెల్వన్, రమేష్ తిలక్, కరుణాకరన్, మునీష్‌కాంత్ తదితరులు నటించారు. తిరుకుమరన్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానరుపై సీవీ కుమార్ నిర్మించారు. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించడంతో రెండో భాగాన్ని తాజాగా తెరకెక్కించారు. తొలి భాగాన్ని నిర్మించిన సీవీ కుమారే రెండో భాగాన్ని కూడా నిర్మించారు. ఇందులో మిర్చి శివ, రాధా రవి, వాగై చంద్రశేఖర్, ఎంఎస్ భాస్కర్, హరీషా, అరుల్‌దాస్ తదితరులు నటించగా అర్జున్ దర్శకత్వం వహించారు. ఈ సినిమా విడుదలపై గత కొన్ని రోజులుగా తర్జనభర్జనలు పడుతున్న క్రమంలో వచ్చే నెల 12వ తేదీ విడుదల చేయనున్నట్టు నిర్మాత ప్రకటించారు.



'సూదు కవ్వుం'లో ఓ దృశ్యం

థ్రిల్లర్ డ్రామా కోణంలో 'ఫణి'

ఏడీఎస్ స్టూడియోస్, అప్పు పాతు పప్పు ప్రొడక్షన్ హౌస్ సంయుక్తంగా ప్రముఖ నటుడు జోజు జార్జ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఫణి'. మలయాళంలో ఇప్పటివకే విడుదలై ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో తమిళంలో ఈ నెల 22వ తేదీన రిలీజ్ చేసే ఈ చిత్రాన్ని థ్రిల్లర్ డ్రామా జానర్‌లో తెరకెక్కించిన నేపథ్యంలో తెరకెక్కించగా, ఈ నెల 22వ తేదీ గోకులం మూవీస్ తమిళనాడు వ్యాప్తంగా విడుదల చేస్తోంది. ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని చిత్ర బృందం బుధవారం నగరంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. రెండేళ్ళపాటు నటనకు విరామం ఇచ్చి ఈ సినిమా చేశానని, ఇందులో నటించిన ప్రతి ఒక్కరూ నాకు ఎంతగానో సపోర్టు చేశారని జోజు జార్జ్ అన్నారు. మీడియా కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. నటి అభినయ మాట్లాడుతూ, 'జోజు జార్జ్‌తో కలిసి నటించిన తొలి చిత్రం. ఆయనకు నేను పెద్ద అభిమానిని. ఈ సినియాలో ఆయనే పెద్ద సపోర్టు. ఆయన గొప్ప దర్శకుడు కూడా. ఈ సినిమాలో నటించడం సంతోషంగా ఉందన్నారు.



మీడియా సమావేశంలో జోజు జార్జ్, అభినయ తదితరులు

23న కంబ రామాయణంపై ప్రవచనాలు

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఆళ్వార్‌పేటలోని నారద గాన సభలో కంబ రామాయణంపై ప్రవచనాలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ ఛైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా తెలిపారు. నగరంలో గురువారం ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళంలో రామాయణంలోని ప్రతిపాత్ర వైశిష్ట్యాన్ని, తమిళ సంస్కృతి, నాగరికతను కళ్ళకుగట్టినట్లు వర్ణించిన మహాకవి కంబన్ అని, ఆయన రచించిన కంభ రామాయణంపై ప్రవచనాలు, సంగీతక కార్యక్రమాలను రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించనుండటం తమకెంతో గర్వకారణంగా ఉందని చెప్పారు. ఈ ప్రవచన కార్యక్రమాలను ప్రొఫెసర్ మహమ్మద్ రేలా, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ప్రియారామచంద్రన్ సంయుక్తంగా నిర్వహించనున్నారు. వీరితోపాటు ప్రముఖ గాత్ర విద్వాంసుడు సిక్కిల్ గురుచరన్ కంభ రామయణ పద్యాలకు సుస్వరాలను సమకూర్చనున్నారు. డాక్టర్ ప్రియారామచంద్రన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ శ్రీరంగం ఆలయాన్ని దర్శించినప్పుడు, సిక్కిల్ గురుచరణ్‌తో కలిసి తాను కంభ రామాయణ పద్యాలను సంగీత స్వరాల మేళవింపుతో ఆంగ్ల అనువాదంతో వినిపించానని చెప్పారు. ఈ ప్రవచన, సంగీత కార్యక్రమాలు 23 సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమై 90 నిమిషాలపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ మహమ్మద్ రేలా, సిక్కిల్ గురుచరణ్, డాక్టర్ ప్రియారామచంద్రన్

సముద్ర సంపదపై పరిశోధనలు ప్రారంభించాలి

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ విజ్ఞప్తి

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర గర్భంలో నిక్షిప్తమైన సంపదపై పరిశోధనలు ప్రారంభించాలని వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సైదాపేటలోని తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీలో బుధవారం తమిళ అభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పురాతనమైన సింధు నాగరికతను కనిపెట్టి ప్రపంచానికి తెలియజేసి వంద సంవత్సరాలు పూర్తవుతోందని, 1891లో ద్రావిడ మహాజన సభను అయోధ్యదాసర్ మద్రాసు ప్రిసీడియంలో ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో పురావస్తు చేపట్టిన భూగర్భ పరిశోధనలు కొనసాగించడంతో పాటు సముద్ర గర్భంలో ఉన్న సంపదపై పరిశోధనలు ప్రారంభించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని ఛాన్సలర్ విశ్వనాథన్ కోరారు.



వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

మంచుపరదాల మాటున కొడైకెనాల్

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో గురువారం వేకువజాము దట్టంగా మంచు కురవడంతో వాహన చోదకులు, పాదచారులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత కొద్ది రోజులుగా కొడైకెనాల్ పరిసర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుంటంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో గురువారం వేకువజాము ఐదు గంటల నుండి ఉదయం ఎనిమిది గంటల వరకు కొడైకెనాల్ అంతా మంచుపరదాలు కప్పేసాయి. దీంతో వాహన చోదకులు హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలను నడపాల్సి వచ్చింది. ఇక ఆ నగరంలోని పలు ప్రాంతాల్లో పాదచారులు చలితో వణకిపోయారు. ఉదయం ఎనిమిది గంటల తర్వాతే పరిస్థితి చక్కబడింది. అంతవరకూ స్థానిక ప్రజలు, పర్యాటకులు ఇబ్బందులకు గురయ్యారు.





సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని ముంబయిలో డిసెంబర్ 8న జరుగనున్న ముంబై- కలైంజర్ తమిళ సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న కరుణానిధి శతజయంతి వేడుకల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆ సంఘం అధ్యక్షుడు ఎం. శేఖరరను, కార్యదర్శి జేమ్స్ దేవనాథన్ తదితరులు

24న ఎన్ఈబీ స్పోర్ట్స్ హాఫ్ మారథాన్

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 24 ఉదయం ఎన్ఈబీ స్పోర్ట్స్ హాఫ్ మారథాన్ నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అపోలో టైర్స్ స్పోర్ట్ మార్కెటింగ్ హెడ్ రిమస్ డి క్రజ్ తెలిపారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసెంట్‌నగర్ అల్కాట్ మెమోరియల్ హైస్కూలు మైదానంలో ఈ నెల 24 వేకువజాము 4.30 నుంచి వివిధ కేటగిరీల్లో మారథాన్ నిర్వహిస్తామన్నారు. పాక్షిక అంధత్వం కలిగిన యువకులు సైతం మార్గదర్శకుల సహాయంతో మారథాన్‌లో పాల్గొంటారని, మారథాన్‌లో ఆరువేలమందికిపైగా పాల్గొనే అవకాశాలున్నాయని చెప్పారు. మీడియా సమావేశంలో ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ ప్రతాప్‌సింగ్, రేస్ డైరెక్టర్ నాగరాజ్ అడిగ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ ప్రతాప్‌సింగ్, మారథాన్ నిర్వాహకులు



పల్లిక్కరనైలో విదేశీ విహంగాల సందడి

దక్షిణ చెన్నై శివారులోని పల్లిక్కరనై పక్షుల శరణాలయంలో విదేశీ పక్షుల సందడి నెలకొంది. ఇక్కడున్న చిత్తడి నేల మధ్యలో ఉన్న సరస్సు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తి స్థాయిలో నిండి రమ్యంగా కనిపిస్తోంది. అందువల్ల సైబీరియా, శ్రీలంక, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి ఇక్కడికి సంతానోత్పత్తి కోసం సుమారు 10వేలకు పైగా పక్షులు మూడు నెలలకు ముందే చేరుకున్నాయి. గూడ బాతులు, కొంగలు తదితర రకాల పక్షులు ఇక్కడ బసచేసి, సంతానోత్పత్తి చేసుకొని మార్చి నెలాఖరులో తిరిగి తమ తమ స్వదేశాలకు వెళుతుంటాయి. విదేశీ విహంగాల శోయగాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో పల్లికరనై వస్తున్నారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి





పల్లెపల్లెనా బెల్టు షాపుల జోరు

పగలు రూ.10 నుంచీ రూ.20 అదనం

రాత్రిళ్లు రూ.30 నుంచీ 150 దాకా అధికం

తెగ తాగిస్తున్నారు!



- మద్యం షాపులకు అనుబంధంగా అనధికారిక గదులు

మద్యం అక్రమ వ్యాపారానికి 'బార్లు' తెరిచారు. దుకాణాల పక్కనే అనధికార గదులు.. పల్లెల్లో బెల్టు షాపులు పెట్టి తెగ తాగిస్తున్నారు. కొన్ని చోట్ల మందు బాబుల సిట్టింగ్‌కు సదుపాయాలు కల్పించారు. మరికొన్నింటికి కూల్ డ్రింక్ షాపుల పేరిట బోర్డులు పెట్టి లోపల మద్యం తాగిస్తున్నారు. బెల్టు షాపుల్లో టైమింగ్‌ను బట్టి అదనపు ధరలు మారుతుంటాయి. ఎక్సైజ్, పోలీసు శాఖలు స్పందించకపోవడంతో నామమాత్రపు కేసులకే పరిమితమవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి: పోటాపోటీగా అనుబంధ గదులు

తిరుపతిలో 24 మద్యం షాపులకు అనుబంధంగా మందుబాబులు తాగేందుకు గదులు ఏర్పాటయ్యాయి. వీటికి తోడు 18 బెల్టు షాపులున్నాయి. రూరల్‌లో 12 మద్యం షాపులకూ సమీపాల్లో తాగేందుకు గదులు ఏర్పాటు చేశారు. పక్కనే కూల్ డ్రింకు షాపుల్లోనూ తాగిస్తున్నారు. రూరల్ మండలంలో 17 బెల్టు షాపులున్నట్టు అంచనా. పగలు క్వార్టర్‌పై రూ.10-20 వరకూ.. రాత్రి పది నుంచీ ఉదయం పది మధ్య బాటిల్‌పై రూ.30 నుంచీ రూ. 50 వరకూ రేటు పెంచి విక్రయిస్తున్నారు.

రేణిగుంట: రాత్రిళ్లు ధరల ఘాటు

రేణిగుంట మండలంలోని పది షాపుల్లో.. తొమ్మిదింటి వద్ద అనధికార గదుల్లో మద్య తాగిస్తున్నారు. రాత్రిళ్ళు షాపులు మూతపడ్డాక మాత్రం అనధికారిక మద్యం అధిక ధరలతో ఘాటెక్కుతోంది. బాటిల్‌పై రూ. 50 నుంచీ రూ. 150 దాకా పెంచి విక్రయిస్తున్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా నడుస్తున్నాయి. ఉదాహరణకు.. అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఒకే మహిళ రెండు సార్లు గాజులమండ్యం పోలీసులకు పట్టుబడింది.

శ్రీకాళహస్తి: సకల సదుపాయాలు



శ్రీకాళహస్తి బస్టాండు ఎదురుగా మద్యం షాపు పక్కనే తాగించడానికి ఏర్పాట్లు

శ్రీకాళహస్తిలోనూ పదింటికి గాను 9 షాపుల పక్కనే అనుబంధ గదుల్లో మందుబాబులకు సకల సదుపాయాలు కల్పించారు. మరో షాపునకూ మరో నాలుగైదు రోజుల్లో అనధికార గదిని అందుబాటులోకి తెచ్చేలా సిద్ధం చేస్తున్నారు. దుకాణాలు మూసేశాక దొంగచాటు అమ్మకాలతో ధరలు పెంచుతున్నారు. స్థానికుల ఫిర్యాదుతో రెండు వారాల కిందట పానగల్ రైల్వే గేట్ సమీపంలో బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు.

బెల్టుషాపులకు 'కోట' జిల్లాలోనే అత్యధికంగా బెల్టు షాపులు కోట మండలంలో ఉన్నాయి. ఏడు లైసెన్స్‌డ్ షాపుల్లో.. కొన్నింటి పక్కన మద్యం తాగేందుకు గదులు ఏర్పాటయ్యాయి. ఇక, 21 పంచాయతీల పరిధిలో 150 దాకా బెల్టు షాపులున్నాయి. వీటిల్లో బాటిల్‌పై రూ.50 నుంచీ రూ. 70 చొప్పున అధిక ధరతో విక్రయిస్తున్నారు. అయినా ఎక్సైజ్, పోలీసు దాడులు, తనిఖీలు లేవిక్కడ.

నాగలాపురం: అనధికారిక బార్లు



నాగలాపురంలో బహిరంగంగానే అనధికార బార్లు

నాగలాపురంలో రెండు, సురుటిపల్లి, టీపీ కోటల్లో ఒక్కొక్కటి చొప్పున మండలంలో నాలుగు లైసెన్స్‌డ్ మద్యం షాపులున్నాయి. వాటి పక్కనే అనధికారికంగా బార్లు నడుస్తున్నాయి. బహిరంగంగానే వీటిని నిర్వహిస్తుండడం విశేషం. నందనం గ్రామంలోని బెల్టు షాపులో బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరతో విక్రయిస్తున్నారు. ఈ షాపుపై పోలీసులు కేసు నమోదు చేసినా మళ్లీ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు.

డక్కిలి: బారుల్లా కూల్ డ్రింక్ షాపులు



డక్కిలిలో వైనషాపు పరిసరాల్లో కూల్‌డ్రింక్ షాపు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

డక్కిలి, మోపూరు రోడ్డు, దగ్గవోలు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున మూడు లైసెన్స్‌డ్ షాపులున్నాయి. డక్కిలి షాపు దగ్గరగా నాలుగైదు కూల్ డ్రింకు షాపులున్నాయి. మిగిలిన షాపుల పక్కనే ఒకటి రెండు చొప్పున కూల్ డ్రింకు షాపులు ఏర్పాటయ్యాయి. ఆ షాపుల్లోనే మందుబాబులు సిట్టింగ్ వేసి తాగుతున్నారు. దీని కోసం కూల్ డ్రింకు షాపు నిర్వాహకులు మద్యం షాపు వారికి రోజుకు రూ. వెయ్యి నుంచీ రూ. 1500 చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. అంటే, మందుబాబులు తాగేందుకు వీరు 'ప్రత్యేక ఛార్జీ' వసూలు చేస్తున్నారు. ఇక, బెల్టుషాపుల్లో బాటిల్‌పై పగలు రూ.20-30.. రాత్రిళ్ల రూ.50 ఎక్కువ ధరతో అమ్ముతున్నారు.

ఎక్సైజ్ గుర్తించిన బెల్టు షాపులే 930

జిల్లాలో 227 లైసెన్స్‌డ్ మద్యం షాపులున్నాయి. వీటిలో 182 దుకాణాలకు అనుబంధంగా గదులున్నట్టు అంచనా. ఇక, 930 బెల్టు షాపులున్నాయని ఎక్సైజ్ అధికారులు గుర్తించినట్టు సమాచారం. బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం దుకాణాల నుంచే కాకుండా తమిళనాడు నుంచీ చీప్ లిక్కర్ తెచ్చి అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. గత 15 రోజుల వ్యవధిలో ఎక్సైజ్ అధికారులు 35 కేసులు నమోదు చేసి 52 మందిని అరెస్టు చేయడంతో పాటు 430 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేశారు. దీన్నిబట్టి జిల్లాలో మద్యం అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

దొరవారిసత్రం: బెల్టుకు వేలం

దొరవారిసత్రం మండలంలో లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు రెండూ వైసీపీ అనుకూల వ్యక్తులకు దక్కాయి. అధికార పార్టీ నాయకులకు భయపడి వారు బెల్టు షాపుల జోలికి వెళ్లడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని అధికార పార్టీ నాయకులు కొందరు బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ఈ షాపులకు సూళ్లూరుపేటలో టీడీపీ కీలక నేత పరిధిలోని నాలుగు దుకాణాల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఇటీవల శ్రీధనపల్లిలో బెల్టు షాపు నిర్వహణకు ఏకంగా వేలం పాటలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ వేలంలో ఓ వ్యక్తి రూ. 1.60 లక్షలకు షాపు దక్కించుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఎక్సైజ్, పోలీసు యంత్రాంగాలు రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. దీంతో బెల్టు షాపులకు మద్యం సరఫరా తాత్కాలికంగా ఆగింది. వేడి తగ్గగానే 45 బెల్టు షాపుల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు.

అన్ని చోట్లా ఇలానే..

- చంద్రగిరి మండలంలో 7 మద్యం షాపులుంటే 16 మంది అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఒక షాపు నిర్వహణ తీసుకున్నారు. వారే బెల్టు షాపులకు తెర లేపారని సమాచారం. మండలాన్ని రెండుగా విభజించి ఒక్కో ప్రాంతానికి ఇద్దరేసి నాయకులు బెల్టు షాపుల దందా నడిపిస్తున్నారని ఆరోపణలున్నాయి. చంద్రగిరిలో ఓ షాపు పక్కనే అనుబంధ గది ఏర్పాటు చేయగా, పోలీసులు తనిఖీ చేసి హెచ్చరించారు. కొన్ని చోట్ల షాపుల కోసం గదులు అద్దెకు ఇచ్చిన యజమానులే వాటి పక్కన కూల్ డ్రింక్ షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. మద్యం షాపులో కంటే బాటిల్‌పై రూ.10, రూ. 20 అదనపు ధరతో విక్రయిస్తున్నారు. మండలంలో 20 బెల్టు షాపులున్నాయని అంచనా.
- పాకాలలో ఐదు షాపులుంటే 27 మంది రాజకీయ నాయకులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. మండలంలో పదిహేను వరకూ బెల్టు షాపులున్నాయి. క్వార్టర్ మీద రూ. 10 నుంచీ రూ. 15 వరకూ అదనం.
- చిన్నగొట్టిగల్లు వ ుండ

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఐదు లైసెన్స్‌డ్ షాపుల పక్కన అనధికారిక గదుల్లో మద్యపానం నడుస్తోంది. 15 గ్రామాల్లో బెల్టు షాపులుండగా, అధిక రేట్లకు విక్రయిస్తున్నారు.



బుచ్చినాయుడు కండ్రిగలో వైన్‌షాపు పక్కనే తాగడానికి ఏర్పాట్లు

లంలో మూడు వైన్ షాపులున్నాయి. ఈ షాపుల్లో మద్యం కొని కొందరు బాటిల్‌పై రూ. 20 నుంచీ రూ. 50 దాకా ధర పెంచి గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. 13 గ్రామాల్లో ఇలాంటి ఏర్పాట్లున్నాయి.

- నాయుడుపేట మండలంలో 13 షాపుల పక్కనా అనధికారిక గదులు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో 20 బెల్టు షాపులున్నట్టు అంచనా. వీటిల్లో బాటిల్‌పై రూ.30 నుంచీ రూ. 50 వరకూ ధరలు పెంచి అమ్ముతున్నారు. బెల్టు షాపుల ఏర్పాటు వెనుక నాయకుల ప్రమేయం ఉంది.
- పెళ్లకూరు మండలంలో రెండు షాపులున్నాయి. ఇక, బెల్టు షాపులపై స్థానికుల ఫిర్యాదుతో తాళ్వాయిపాడు గ్రామంలో ఎక్సైజ్, పోలీసు అధికారులు తనిఖీలు చేసి ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.
- గూడూరులో 12 షాపులున్నాయి. వీటిల్లో పలువురు మద్యం కొని.. గ్రామాల్లో బాటిల్‌పై రూ.50 పెంచి విక్రయిస్తున్నారు. ఇలాంటి వారిపై ఎక్సైజ్ పోలీసులు ఐదు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని మూడు షాపుల వద్ద మాత్రం పక్కనే కూల్ డ్రింకు షాపులు వెలిశాయి. వాటిలో మద్యం విక్రయిస్తున్నారు.
- వాకాడు మండలంలో నాలుగు మద్యం దుకాణాల పక్కనా కూల్ డ్రింకు షాపులు పెట్టారు. గ్రామానికి రెండు మూడు బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి.

మద్యం షాపులన్నీ సిండికేట్‌గా మారాయని, నిర్వాహకులే బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బెల్టు షాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.50-80 అదనంగా విక్రయిస్తున్నారు.

- చిల్లకూరు మండలంలోని 6 షాపుల పక్కనా అనధికారిక షాపులు ఏర్పాటయ్యాయి. బాటిల్‌పై రూ. 50 పెంచి అమ్మేస్తున్నారు.
- చిట్టమూరు మండలంలో నాలుగు దుకాణాల పరిధిలోని గ్రామాల్లోనూ బెల్టు షాపులు నడుస్తున్నాయి. బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- బాలాయపల్లి మండలంలో మూడు మద్యం షాపుల పక్కనా అనధికారిక బార్ రూమ్‌లు వెలిశాయి. ప్రతి గ్రామంలో రెండు చొప్పున బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి.
- వెంకటగిరిలో తొమ్మిది షాపుల పక్కనే ఒక్కో కూల్ డ్రింక్ షాపు కొలువు దీరాయి. వీటిల్లోనే మందుబాబులు మద్యం తాగుతున్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు సరేసరి. ఇటీవలే ముదంపల్లిలో బెల్టు షాపును గుర్తించి ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదుచేశారు.
- పుత్తూరులో ఏడు షాపుల వెనుక మద్యం తాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఓ వైసీపీ నాయకుడు విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుపుతుండగా.. అతడికి అధికార పార్టీ నాయకులు సహకరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

కేవీబీపురం మద్యం దుకాణం వెనుకవైపు ఎంచక్కా పందిరి వేసి, టేబుళ్ల తరహాలో బండలు అమర్చి మద్యం తాగడానికి ఏర్పాటు చేశారు.



కేవీబీపురంలో వైన్‌షాపు పక్కన ఖాళీ స్థలంలో మందు బాబుల కోసం బండలతో టేబుళ్ల తరహాలో వేశారిలా

రూ.300 దర్శన టికెట్లు 25న విడుదల

తిరుమల, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు ఈ కోటాను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా విడుదల చేస్తారు.అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని టీటీడీ వసతి సముదాయాల్లో ఖాళీలను కూడా విడుదల చేస్తారు. మరోవైపు 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు టికెట్లు జారీ చేయనున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 59,231 మంది శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆర్‌ఆర్‌బీ పరీక్షలకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగనున్న ఆర్‌ఆర్‌బీ అర్హత పరీక్షల అభ్యర్థుల కోసం ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు సీపీఆర్‌వో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-సికింద్రాబాదు, కరీమ్‌నగర్-కాచిగూడ, కాచిగూడ-కర్నూలు సిటీ, హుబ్లీ-కర్నూలు సిటీ, నాందేడ్-తిరుపతి, కాకినాడ టౌన్-తిరుపతి మధ్య రైళ్లు నడుపుతామని తెలిపారు.

- నాందేడ్-తిరుపతి మధ్య 23న ప్రత్యేక రైలు(07105) నాందేడ్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరి ముడికేడ్, ధర్మాబాదు, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్ సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్డు, పాకాల స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.
- తిరుపతిలో ప్రత్యేక రైలు (07106) 24వ తేదీ మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు 8.35 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.
- కాకినాడటౌన్‌లో 23వ తేదీ ప్రత్యేక రైలు(07107) ఉదయం 6.30 గంటలకు బయలుదేరి సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, న్యూగుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, బిట్రగుంట, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా అదేరోజు సాయంత్రం 6.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.
- తిరుపతిలో 24వ తేదీ ప్రత్యేక రైలు(07108) రాత్రి 7.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు కాకినాడటౌన్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు ఈనెల 23, 24 తేదీలతో పాటు 26, 28, 29 తేదీలలో రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

సైబర్ ఉచ్చులో ఎరువుల వ్యాపారి

- నిమిషాల వ్యవధిలో రూ 13.5 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ ఉచ్చులో పడి తిరుపతికి చెందిన ఓ ఎరువుల వ్యాపారి రూ.13.5 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటకు చెందిన ఎరువుల వ్యాపారి (మార్కెటింగ్) జయరామిరెడ్డికి తిరుపతిలో ఐసీఐసీఐ బ్యాంకులో ఖాతా ఉంది. అకౌంటు వుంది. ఈయన ప్రమేయం లేకుండానే 'వీఐపీ ఈ7 ఇన్వెస్ట్‌మెంట్ అలియన్స్ లెర్నింగ్ వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ అయ్యారు. ఈ గ్రూప్‌లో వచ్చిన ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేశారు. అప్పుడు ఆయన మొబైల్‌లో ఫేక్ 'సీడబ్ల్యూఏ మ్యానేజ్ యాప్ కూడా డౌన్‌లోడ్ అయింది. అందులో ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ చేశారు. అనంతరం అతడి ఖాతాలో రూ.24.3 లక్షలు కనిపించాయి. ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేయబోగా యాప్ కనిపించకుండా పోయింది. తాను మోసపోయాయని తెలుసుకున్న ఆయన.. రూ.13.5 లక్షలు నష్టపోయినట్లు తిరుపతి రూరల్ పోలీసు స్టేషనులో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీపీఐపై నమ్మకం ఏర్పడితే ప్రజలే అధికారం ఇస్తారు

పళనిలో తిరుమావళవన్

ప్యారీస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీపీఐపై నమ్మకం ఏర్పడితే ప్రజలే అధికారం ఇస్తారని ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ పేర్కొన్నారు. దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి క్షేత్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. వించ్ రైలు ద్వారా కొండ ఆలయానికి వెళ్లి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం మెట్ల మార్గంగుండా కొండ దిగువన ఉన్న పులిపాణి ఆశ్రమానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు తిరుమావళవన్‌ను ఆహ్వానించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా తిరుమావళవన్ మీడియాతో మాట్లాడుతూ... పళని దేవస్థానం నిర్వహణలోని మెట్రిక్ పాఠశాలలో గౌరవ వేతనంతో పనిచేసే టీచర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పళని కొండ కింద ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారుల జీవనాధారం దెబ్బతినకుండా ప్రభుత్వం వారికి శాశ్వత పరిష్కారం కల్పించాలని తిరుమావళవన్ విజ్ఞప్తి చేశారు.



పళని దండాయుధపాణి ఆలయంలో ఎంపీ తిరుమావళవన్